## క్లుప్తంగా

### ఘనంగా సరస్వతీ పూజ



వెంకటాచలం : మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. బాల్య వివాహాల నిర్మూలనపై చైతన్యం కలిగించేలా లఘు దృశ్య నాటిక అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఎంఈఓ మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమంలో నిడిగుంటపాళెం, గుడ్లూరువారిపాళెం, ఇస్కపాళెం పాఠశాలల హెచ్ఎంలు చలపతి, వెంకటరమణ, పార్వతీశం, విద్యాకమిటీ చైర్‌పర్సన్ మౌనిక, ఉపాధ్యాయులు మాధవ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

**కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..**

పొదలకూరు : స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శనివారం సరస్వతీ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు హాల్ టికెట్లు, ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులు సాధించాల్సిందిగా సూచించారు. కరెస్పాండెంట్లు సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రిన్సిపల్ ఎ.సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### క్షయ రహిత గ్రామంగా కనుపర్తి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

పొదలకూరు : క్షయరహిత గ్రామంగా కనుపర్తి గుర్తింపు తెచ్చుకుందని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. మండలంలోని కనుపర్తి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించి క్షయ వ్యాధి నివారణ చర్యలపై వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రెండేళ్లుగా ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాలేదని వెల్లడించారు. కనుపర్తి గ్రామాన్ని క్షయరహిత గ్రామంగా ప్రకటించేందుకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖకు నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది అందుకు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం ఏఎన్ఎం వద్దనున్న రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏసీఎస్ఆర్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఖాదర్‌వలి, వైద్యాధికారి కిరణ్‌రిషిత, విస్తరణాధికారి రవికుమార్ తదితరులు ఉన్నారు.

### పల్స్ పోలియో విజయవంతానికి కృషి



మాట్లాడుతున్న వైద్యాధికారులు

కొడవలూరు : మార్చి 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమ విజయవంతానికి వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది సమైక్యంగా కృషి చేయాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు కోరారు. స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో పల్స్‌పోలియో నిర్వహణపై వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైరిస్క్ ఏరియాలను ఇప్పటికే గుర్తించినట్లు వివరించారు. వీటిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 2,436 మందికి పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా కేటాయించినట్లు వివరించారు. ఇందుకోసం మూడు రూట్‌లలో 32 బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక మొబైల్ బూత్ కూడా ఏర్పాటు చేసినందున వీరు హైరిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, తాత్కాలిక గుడారాలు, రైల్వేస్టేషన్‌ల వద్ద ఉంటున్న వారిపై దృష్టి పెట్టాలని సూచించారు. వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పరస్పర సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీహెచ్ఓ సోమశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు టి.నాగభూషణమ్మ, ఎస్.నిర్మల, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్ఏ షఫీఉద్దీన్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పొదలకూరు : సంగం-పొదలకూరు మార్గంలో తోడేరు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మొగళ్లూరుకు చెందిన మలిరెడ్డి విష్ణు కిసాన్‌క్రాఫ్ట్ కంపెనీలో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని బైక్‌పై వస్తుండగా తోడేరు క్రాస్ వద్ద ఆటో ఢీకొంది. ప్రమాదంలో విష్ణు గాయపడగా ఆటో బోల్తా పడింది. క్షతగాత్రుడిని పొదలకూరు సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

# లబ్ధిదారులకు గృహాలను స్వాధీనం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు లబ్ధిదారుడి భాగస్వామ్య మొత్తాన్ని చెల్లించి, గృహాలను స్వాధీనం చేసేలా యజమానులకు అవగాహన కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో నిర్మాణాల పురోగతిపై మెప్మా, హౌసింగ్ విభాగం, నగరపాలక సంస్థ హౌసింగ్ అమెనిటీస్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మాణ పనులు పూర్తయిన గృహాలను త్వరితగతిన అందజేసేందుకుగానూ లబ్ధిదారుల వాటా వసూలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, మెప్మా పీడీ రవీంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ నాగరాజు, ఈఈ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు**

నగరపాలక సంస్థలో హెల్త్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు గిరీష్‌కుమార్, ఈశ్వరయ్య, మహబూబ్ షరీఫ్‌కు ఉత్తర్వులను కమిషనర్ వికాస్ మర్మత్ అందజేశారు. కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# ఆదాలకు మద్దతుగా విస్తృత ప్రచారం



32వ డివిజన్లో..



20వ డివిజన్లో..

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ 32వ డివిజన్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఎన్‌సీసీ కాలనీలోని వెంకయ్య స్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ అవినాష్, మాజీ కౌన్సిలర్ ఉదయగిరి నరసింహులుగౌడ్, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు శశికళ, నేతలు రెహ్మాన్, హరిత, పెంచలమ్మ, అజీజ్, రజాక్, కుప్పన్న, విశ్రాంత తహసీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బారకాసు): నగరంలోని 20వ డివిజన్ పరిధిలో గల ఎర్రకోనేటిమిట్ట, ఎస్టీకాలనీలో ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రావు శ్రీనివాసరావు నిర్వహించారు. తొలుత హనుమాన్ జంక్షన్లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. నేతలు పాతపాటి పుల్లారెడ్డి, పద్మజాయాదవ్, వాసంతిరెడ్డి, సరళమ్మ, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌యాదవ్, వెంకట్రామిరెడ్డి, సురేష్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• 23వ డివిజన్లోని అనగుంట కాలనీలో కార్పొరేటర్ దుద్దుగంట శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ – 2 అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

• బుజబుజనెల్లూరు, రామ్‌నగర్, విద్యుత్‌కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని 25వ డివిజన్ ఇన్‌చార్జి నవాబ్ జాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత రామాలయంలో పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, నేతలు అమీర్‌జాన్, మురళి, శ్రీహరి, జాహీద్, రాము, పెంచలయ్య, మున్వర్, శ్రీహరి, రవి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

• 41వ డివిజన్ పరిధిలోని మనుమసిద్ధినగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని కార్పొరేటర్ కువ్వాకోలు విజయలక్ష్మి, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి బాబ్జీ యాదవ్ నిర్వహించారు. నేతలు గోపీ, ప్రసాద్, ఏడుకొండలు, సుధాకర్, శేఖర్, శ్రీనివాసులు, వేణు, రాజా, రాము, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కిలివేటికి మంత్రి పరామర్శ



నెల్లూరు(దర్గామిట్ట): సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను నగరంలోని ఆయన నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే తల్లి మస్తానమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎంపీపీ అనిల్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ కణ్ణన్‌కు అవార్డు



నెల్లూరు సిటీ: నారాయణ డెంటల్ కళాశాల ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ కణ్ణన్ డాక్టర్ ఎస్ఎల్ బాలీ మెమోరియల్ అవార్డును శనివారం అందుకున్నారు. ఇంటర్నేషనల్ కాలేజీ ఆఫ్ డెంటిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్వొకేషన్ అండ్ అవార్డుల కార్యక్రమంలో గురుగోవింద్‌సింగ్ ఇంద్రప్రస్థ వర్సిటీ, ఢిల్లీ వారు ప్రదానం చేశారు.

# సిద్ధి విఘ్నేశ్వరాలయంలో పూజలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ద్వారకానాథ్ తదితరులు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని సిద్ధి విఘ్నేశ్వరాలయంలో స్వర్ణకవచ అలంకార మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1800 కిలోల పుష్పాలతో పుష్పయాగాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ, పాండురంగ అన్నదాన సమాజ కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బాలాజీ, ఆలయ చైర్మన్ బయ్యా ప్రసాద్, కమిటీ సభ్యులు అనిల్‌కుమార్, వెంకటసురేష్‌బాబు, లీలామోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కనులపండువగా లక్ష్మీనృసింహుడి నగరోత్సవం



పూజలు చేస్తున్న చలపతిరావు



విశేషాలంకారంలో లక్ష్మీనృసింహుడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి నగరోత్సవాన్ని కనులపండువగా శనివారం నిర్వహించారు. వేదగిరిలోని అష్టలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి స్టోన్‌హౌస్‌పేటలో డీసీఎమ్మెస్‌కు చెందిన పాత రైస్‌మిల్లులో కొలువుదీరారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు దేవస్థాన ప్రధానార్చకులు భాస్కరాచార్యులు, కృష్ణమాచార్యులు అభిషేకాలు చేశారు. అనంతరం కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ నగరోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలుపొంది జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలను డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు జరిపారు. ఈఓ గిరికృష్ణ, డీసీఎమ్మెస్ డైరెక్టర్లు గురునాథం, సురేష్‌రెడ్డి, బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### 'ఓవెల్'లో విజ్ఞాన ప్రదర్శన

నెల్లూరు (టౌన్): నగరంలోని ఓవెల్ స్కూల్లో విజ్ఞాన ప్రదర్శనను శనివారం నిర్వహించారు. గ్రూప్ డిస్కషన్, డిజిటల్ డెమో, గేమ్ షో, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ గ్యాలరీ తదితరాలను విద్యార్థులు ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రంజని, స్కూల్ ఎండీ వేణు, సీఈఓ ప్రమీల, జీఎం మహదేవన్, ప్రిన్సిపల్ జగన్నాథ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై చర్చావేదిక



నెల్లూరు(బృందావనం): ఓటు హక్కుపై చర్చావేదికను పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఏ ట్రస్ట్ ఫర్ ఆల్ సంస్థ అధ్యక్షుడు అళహరి వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అనంతరం ఓటర్ కాస్టింగ్ ప్రోగ్రెస్ కార్డులను ఆవిష్కరించారు. రామచంద్రప్రసాద్, లక్ష్మీనరసింహప్రసాద్, రామ్మోహన్‌రావు, మురళీమోహన్‌రావు, రాచపాళెం రఘు, శ్రీమన్నారాయణ, రవీంద్ర, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో విద్యుత్ సంస్థకు రావాల్సిన రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్ నుంచి జిల్లా విద్యుత్ అధికారులతో శనివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. బకాయిలు ఎక్కువగా ఉన్న సెక్షన్లలో నోడల్ ఆఫీసర్లను ప్రత్యేకంగా నియమించామని, వీరికి కేటాయించిన ప్రాంతాల్లో విద్యుత్ కలెక్షన్లపై పర్యవేక్షించి వసూలు చేయాలని ఆదేశించారు. పంచాయతీలకు నిధులు విడుదలయ్యాయని, వీరి నుంచి బకాయిలను వసూలు చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ బకాయిలను వసూలు చేయాలని కోరారు.

### బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తోటపల్లిగూడూరు : మండలంలోని పలు ప్రాంతాల్లో ఇందుకూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై కళాజాత బృంద సభ్యులు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కోడూరు పంచాయతీ ముక్కంటమ్మ గిరిజన కాలనీ, కోనేటితోపు, వరిగొండ, మల్లికార్జునపురం, కొలిదిబ్బ తదితర గిరిజన కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు జరిగాయి. 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయకూడదని, బాలికలను చదివించాలని, గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు రంగమ్మ, విజయలక్ష్మి, కళాజాత సిబ్బంది చిరంజీవి, రవితేజ, శారద, వరప్రసాద్ పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేయాలి

ముత్తుకూరు : ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపేయాలని ముత్తుకూరు మత్స్యకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నినదించారు. మండలంలోని తాళ్లపూడిలో శనివారం ఎన్ఎస్ఎస్ క్యాంప్ రెండో రోజున విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు శ్రీవిద్య, త్రివేణి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని కాపాడాలి–ప్లాస్టిక్‌ను నిషేధించాలి అంటూ ప్రతి వీధిలో నినాదాలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను ఏరే కార్యక్రమాన్ని నిర్వహించారు.

# నేత్రపర్వంగా బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): వ్యాస పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బంగారు గరుడసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. తిరుమంజనం, పూజలను విశేషంగా జరిపారు. ఉభయకర్తలుగా శ్రీనివాసరావు, మధుసూదన్‌రావు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్త మండలి చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖలీల్ అహ్మద్‌ను గెలిపించుకుందాం



ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. నగరంలోని 40వ డివిజన్లో గల కొండదిబ్బ, మున్సిపల్ క్వార్టర్స్, కోనేటిమిట్ట తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని శనివారం వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడారు. నగరాన్ని అన్ని విధాలా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభివృద్ధి చేశారని చెప్పారు. సామాన్యుడినైన తనకు నియోజకవర్గంలో అవకాశం కల్పించారని, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నగరాన్ని తామే అభివృద్ధి చేశామంటూ నారాయణ మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, పార్టీ నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, మిద్దె మురళీకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. అర్హులను లబ్ధిదారులుగా చేర్చాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 48 / 1, 2 కోటమిట్ట, 48 / 3 చిన్నబజార్, 49 / 2 రామిరెడ్డి వీధి వార్డు సచివాలయాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పేదలందరికీ గృహాలు కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్, హాజరు, స్పందన రిజిస్టర్లు తదితరాలను పరిశీలించారు.

# భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. కంచి పీఠానికి చెందిన సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. ఉభయకర్తలుగా పైడిపాటి విజయసారథి దంపతులు వ్యవహరించారు. మఠం మేనేజర్ కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పాల్గొన్నారు.

# గణపతి దేవస్థాన నిర్మాణానికి భూమి పూజ



నెల్లూరు(బారకాసు): బీవీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలో లక్ష్మీ గణపతి దేవస్థాన నిర్మాణానికి భూమి పూజను శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దర్భా అనిల్‌శర్మ, అవధానం రామ్మోహన్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. వ్యాపారవేత్త మొయిళ్ల మల్లికార్జునరెడ్డి, తేజస్విని దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ గౌరి, మల్లికార్జునరెడ్డి, దశయ్య, రంగయ్యనాయుడు, కృష్ణారెడ్డి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని శనివారం నిర్వహించారు. పూజలను ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, వేణుగోపాల్, మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, ఎమ్మెల్ఎన్ యాదవ్, కోశాధికారి శ్రీనివాసులు, మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నేత్రదానం



నేత్రదాత కుటుంబీకులకు సర్టిఫికెట్ ప్రదానం

నెల్లూరు సిటీ: జేమ్స్‌గార్డెన్‌లో నివాసం ఉంటున్న జయంతి (52) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జీజీహెచ్ నేత్రదాన కౌన్సెలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని సూచించారు.